

గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

సాలూరు రూరల్,జూన్ 8: సాలూరులో గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని కేంద్ర బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా బృంద సభ్యులు మొలాయ్ సన్యాల్, సుదర్శన్ భగత్ తదితరులు గర్భిణులతో మాట్లాడి.. వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణుల వసతి గృహం లక్ష్యాలను తెలుసుకున్నారు. గిరిజన గర్భిణుల సుఖ ప్రసవానికి హాస్టల్ నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాచిపెంట మండలంలో పణుకువలస తదితర గ్రామాల్లో పర్యటించి అక్కడి గర్భిణులతో మాట్లాడారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డి.శివకుమార్ తదితరులు ఉన్నారు.



వైసీపీ వీరవిధేయుల్లో వణుకు!

- ఐదేళ్లూ ఆ పార్టీ నాయకులతో అంటకాగిన కొంతమంది అధికారులు
- నిబంధనలు మరిచి... గీత దాటి వ్యవహరించిన వైనం
- ప్రతిపక్ష నేతలను వేధించడంలో ముందంజ
- జిల్లా శాఖ అధికారులు సైతం వత్తాసు
- ప్రభుత్వం మార్పుతో వారిలో మొదలైన టెన్షన్
- తమ పరిస్థితేమిటోనని మథనం



పార్వతీపురం, జూన్8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు మరిచిపోయి... గీత దాటి మరీ వైసీపీతో అంటకాగిన కొంతమంది అధికారుల్లో వణుకు మొదలైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారంతా తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ పరిస్థితేమిటోనని మథనపడుతున్నారు. వాస్తవంగా గత ఐదేళ్ల వైసీపీ సర్కారు పాలనలో జిల్లాలో కొన్ని శాఖలకు చెందిన కొంతమంది అధికారులు ఆ పార్టీకి వీర విధేయులుగా మారిపోయారు. సీఎం జగన్‌పై వీరభక్తిని ప్రదర్శించారు. ప్రభుత్వ అధికారులమని మర్చిపోయి ఇష్టానుసారంగా వ్యవహరించారు. నిబంధనలు తుంగలో తొక్కి.. వైసీపీ నాయకులకు అనుకూలంగా పనిచేశారు. టీడీపీ శ్రేణులపై విరుచుకుపడ్డారు. వారిపై వైసీపీ శ్రేణులు దాడులు చేసినా.. ఎటువంటి చర్యలు తీసుకునేవారు కాదు. ఏదో నామమాత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకునేవారు. కాగా ఇటువంటి పరిస్థితి గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో లేదు. ప్రభుత్వాలు, ప్రజలకు అధికారులు వారధులుగా ఉండేవారు. నిస్పక్షపాతంగా విధులు నిర్వర్తించేవారు. సాధారణంగా ఏ ప్రభుత్వ అధికారంలో ఉన్నా.. దానికి మంచి పేరుతెచ్చే విధంగా వారు పనిచేయాలి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరించారు. వైసీపీపై వీరాభిమానం చూపారు. వైసీపీ సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు నియోజకవర్గాల్లో వారు చెప్పిన మాటే వేదంగా చేసుకొని ముందుకు సాగారు. వారి అక్రమాలకు సహకరించారు. ప్రధానంగా ప్రతిపక్షమైన టీడీపీ నేతలను, ప్రభుత్వ తీరును ప్రశ్నించేవారిని వేధించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించారు. కొందరు అధికారులు ఏకంగా వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరించారు. గత ఐదేళ్లలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కొన్ని శాఖల్లో అధికారులు ఇదే విధంగా వ్యవహరించారు. కాగా కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో వారిలో టెన్షన్ మొదలైంది. అప్పుడు వీరవిధేయత్వం చూపి టీడీపీని.. సామాన్యప్రజలను ఇబ్బంది పెట్టేందుకు సహకరించిన అధికారుల జాబితా సిద్ధమవగా, త్వరలో ప్రక్షాళన జరిగే అవకాశముంది. దీంతో ఎవరిపై వేటు పడుతుందోనన్న గుబులు అధికారులను వెంటాడుతోంది. గత ఐదేళ్లలో జిల్లాలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు, అధికారుల తీరును ఇప్పుడు తెలుసుకుందాం.

కొన్ని ఘటనలు..

ఐదేళ్లకోసారి కొత్త ప్రభుత్వం కొలువుతీరుతుంది. ప్రజలకు మంచి సేవలందిస్తారన్న నమ్మకమున్న అధికారులను రాష్ట్రంలో ఎక్కడున్నా తమ ప్రాంతానికి తెప్పించుకుని.. వారికి ప్రాధాన్య పోస్టులను కట్టబెట్టేవారు. ఏ ప్రభుత్వమైనా ఇదే పద్ధతిని అనుసరిస్తుంది. అయితే వైసీపీ ఐదేళ్ల పాలనలో మాత్రం ఉద్యోగుల నియామకాలు.. వారిని ఉపయోగించుకున్న తీరు పలు విమర్శలకు దారితీస్తోంది.




- జిల్లాలోని ఒక ముఖ్య శాఖకు చెందిన ఇంజనీరింగ్ శాఖ ఉన్నతాధికారి తాను ఇన్‌చార్జిని అని మరిచిపోయి వైసీపీ నాయకుడులా వ్యవహరించారు. అంతేగాకుండా కొంతమంది ఏఈలతో వైసీపీ నాయకులకు అనుకూలంగా పనిచేయించారు. ఆ శాఖలో ఏ చిన్నపని చేపట్టాలన్నా ముందుగా ఎమ్మెల్యే, గ్రామస్థాయి నాయకుల నోటీసులో పెట్టిన తర్వాతనే పనులు ప్రారంభించేవారు. మొత్తంగా వైసీపీ నాయకుల అనుమతి లేనిదే ఆ శాఖలో ఏ పనీ ముందుకు సాగని పరిస్థితి. నేటికీ ఆ ఇంజనీరింగ్ అధికారి అదే శాఖలో కొనసాగుతున్నారు. గత ఐదేళ్లలో జిల్లాకు చెందిన కొన్ని ఇంజనీరింగ్ శాఖల్లో ఇదే పరిస్థితి కొనసాగిందని చెప్పవచ్చు.
- జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు విభాగానికి సంబంధించి ఒక ఇంజనీర్ టీడీపీ ప్రభుత్వ కాలంలో ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశారని సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు.
- ఏటా రైతులకు విత్తనాలు అందించే సమయంలో కొంతమంది మండల వ్యవసాయాధికారులు ముందస్తుగా వైసీపీ నాయకులకు ఫోన్లు చేసేవారు. ఆ పార్టీ నేతలు సూచించిన కొంతమంది రైతులకే ముందుగా అధికారులు విత్తనాలు అందించేవారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఈ పరిస్థితి ఉండేది.
- జిల్లాలోని పార్వతీపురం, సాలూరు పురపాలక సంఘాల్లో కొంతమంది అధికారులు వైసీపీకి అనుకూలంగా పనిచేసేవారు. ఆ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లా వ్యవహరించారని చెప్పవచ్చు. టీడీపీకి చెందిన కార్యకర్త గాని, నాయకుడు గాని ఇళ్లు కట్టుకోవాలని ముందుకు వెళ్తే.. దానికి సంబంధించి ప్లాన్ అప్రూవల్ కూడా మంజూరు చేసేవారు కాదు. తీవ్ర ఇబ్బందులు పెట్టేవారు. చివరకు దళారులను ఆశ్రయించి ఎంతో కొంత ముట్టజెప్పి ప్లాన్ అప్రూవల్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఆ రెండు పురపాలక సంఘాల్లో ఉండేది.
- కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాలు చేస్తే.. కొంతమంది పోలీసులు వారిపై దురుసుగా ప్రవర్తించేవారు. టీడీపీ శ్రేణులను రోడ్లపై ఈడ్చుకుంటూ పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఘటనలెన్నో ఉన్నాయి. కొంతమంది పోలీస్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కానిస్టేబుల్ కూడా టీడీపీ నేతలు, కార్యకర్తలపై ఇష్టానుసారంగా వ్యవహరించేవారు.
- టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ వర్గాలు దౌర్జన్యం చేసి బహిరంగంగా దాడులు చేసినా.. వారిపై ఎటువంటి కేసులు నమోదయ్యేవి కావు. పోలీసులు ఏ విధమైన చర్యలు తీసుకోకుండా నామమాత్రపు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకునేవారు. తిరిగి అదే వైసీపీ వర్గాలు టీడీపీ శ్రేణులపై ఫిర్యాదు చేస్తే.. వెనువెంటనే కేసులు నమోదు చేసేవారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలో మున్సిపల్ కార్యాలయంలో టీడీపీ కౌన్సిలర్‌పై వైసీపీకి చెందిన కౌన్సిలర్‌తో పాటు ఆయన అనుచరులు బహిరంగంగా దాడి చేశారు. కానీ ఈ ఘటనలో పోలీసులు సక్రమంగా స్పందించలేదు. ప్రభుత్వ కార్యాలయంలో దాడులు, దౌర్జన్యానికి తెగబడిన వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా చర్యలు తీసు కోలేదు. దీంతో టీడీపీ శ్రేణులు బాధితుడి తరపున పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా గత ఐదేళ్లలో పోలీస్‌శాఖలో కొంతమంది అధికారులు వైసీపీ నాయకులపై ఏ మేరకు స్వామిభక్తి చాటారో పై ఘటననే ఒక ఉదాహరణగా చెప్పొచ్చు.
- జిల్లాలో ఈ విధంగా కొంతమంది అధికారులు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అనుచితంగా వ్యవహరించారని చెప్పొచ్చు. ఇదే సమయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలకు వారు సేవకులుగా మారిపోయారని చెప్పొచ్చు. వైసీపీ ప్రభుత్వం అరాచక పాలనకు ఓటర్లు ముగింపు పలకడంతో ఇప్పటివరకు ఆ పార్టీపై వీరభక్తి చూపిన అధికారుల్లో బదిలీల గుబులు పట్టుకుంది.

ఇలా ఉంటే.. సాగు ఎలా?



విక్రంపురం వద్ద తుప్పలతో నిండిన తోటపల్లి సాగునీటి కాలువ



నడిమికెళ్ల వద్ద పిల్ల కాలువ షట్టరు ఇలా..

వీరఘట్టం మండలంలో తోటపల్లి సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. వైసీపీ సర్కారు వాటి నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో కాలువలు పూర్తిగా తుప్పలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. వాస్తవంగా తోటపల్లి ఎడమ కాలువ మొదటి బ్రాంచి నుంచి కడకెల్ల, నడిమికెల్ల, విక్రంపురం, చిట్టిపుడివలస, నడుకూరు, కిమ్మి, కొట్టుగుమ్మడ గ్రామాల్లో ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే ఈ కాలువలో కనీసం పూడికలు కూడా తీయించడం లేదు. దీంతో ఏటా రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వరుణుడిపైనే ఆధారపడి పంటలు పండించుకోవాల్సి వస్తోంది. మరోవైపు గట్లు బలహీనపడడం, గేట్లు మరమ్మతులకు గురికావడంతో నీరు వృథాగా పోతుంది. మూడేళ్లుగా రైతులు నిధులను పోగుచేసి తురకనాయుడువలస తదితరచోట్ల కాలువల్లో మరమ్మతులు చేపడుతున్నారు. శ్రమదానంతో పూడికలు తొలగిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఏటాలానే ఈ సారి కూడా ఇబ్బం దులు తప్పవా? అని చింతిస్తున్నారు. ఉపాధి హామీ నిధులతో కాలువ లోని పూడికలను తొలగించి గట్లును పటిష్ఠ పర్చాలని వారు కోరుతు న్నారు. దీనిపై సాగునీటి పారుదలశాఖ ఏఈఈ రాజేష్‌కుమార్‌ను వివరణ కోరగా.. కాలువలో పూడికలను తొలగించాలని ఉపాధి హామీ ఏపీవో సత్యం నాయుడును ఆదేశించామన్నారు. ఈ ఏడాది సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయకట్టుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.

\- వీరఘట్టం

నాణ్యతతో పనులు చేపట్టండి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

పాచిపెంట, జూన్ 8 : నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపట్టాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. పాచిపెంట మండలంలో కుంతాం - తుమ్మిగుడ్డి గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి పనులను శనివారం ఆయన పరిశీలించారు. కొద్ది రోజుల్లో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. రూ. 5.75 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సుమారు 20 గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. నిర్దీత గడువులోగా పనులు పూర్తి చేసి.. గ్రామస్థులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజీ, స్థానిక అధికారులు ఉన్నారు.



బ్రిడ్జి పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్


సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

● డీఎంవో జగన్మోహన్‌రావు

గరుగుబిల్లి, జూన్ 8 : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంవో) టి.జగన్మోహనరావు ఆదేశించారు. శనివారం గరుగుబిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమయంలో అధికంగా జ్వరాలు వ్యాపించే పరిస్థితి ఉందన్నారు. క్షేత్రస్థాయిలో నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. విధిగా రోగుల నుంచి రక్త పూతలను సేకరించాలని సూచించారు. జ్వర లక్షణాలతో వచ్చిన వారికి మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో మలేరియా నిర్ధారణకు మైక్రో స్కోప్ పరీక్ష పద్ధతి తప్పనిసరి అని అన్నారు. కుక్క, పాము కాటు చికిత్సలకు అవసరమైన ఏఆర్‌వీ, ఏఎస్‌వీ ఇంజక్షన్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలో సాధారణ ప్రసవాలు సంఖ్య పెంచాలని సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ పరిశీలనలో డాక్టర్ సంతోష్‌కుమార్, ఏఎంవో సూర్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు ఉన్నారు.

కొఠియా సమస్య పరిష్కారమయ్యేనా?

- ఏపీలో అధికారంలోకి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం
- ఒడిశాలో మొదటిసారి కొలువుదీరనున్న బీజేపీ సర్కారు
- ప్రస్తుత రాజకీయ పరిస్థితులు అనుకూలం
- వివాదం కొలిక్కి రానుందని ప్రజల్లో ఆశ



కొఠియా గ్రూప్ ఎగువశెంబి గ్రామం

సాలూరు రూరల్, జూన్ 8: ఏవోబీ వివాదాస్పద ప్రాంతం కొఠియా సమస్యకు చెక్ పడేనా? దశాబ్దాల నాటి వివాదానికి తెరపడేనా?.. రెండు రాష్ట్రాల్లో సర్వత్రా ఇప్పుడిదే చర్చనీయాంశమవుతోంది. ఏ ఇద్దరు కలిసినా.. దీనిపైనే మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతో ఆ సమస్యకు చెక్ పడే అవకాశముందని ఏపీ, ఒడిశా వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానున్న నేపథ్యంలో కొఠియా వివాదం త్వరలోనే పరిష్కారం కానుందని పలువురు భావిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా కొఠియా గ్రూప్ గ్రామాల వివాదం ఈనాటిది కాదు. 1935లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వాల నుంచి నడుస్తూనే ఉంది. స్వాతంత్ర్య అనంతరం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో ఈ వివాదం ముదిరింది. కొఠియా గ్రామాలు తమవే అని ఒడిశా సుప్రీంకోర్టు తలుపుతట్టింది. ఈ గ్రామాల వివాదంపై 1968, డిసెంబరు 2న సుప్రీంకోర్టు స్టేటస్‌కో జారీ చేసింది. దీంతో కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఏపీ, ఒడిశాలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తునే ఉన్నాయి. కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఇరు రాష్ట్రాలకు చెందిన ప్రజలు ఉన్నారు. వారికి రెండు రాష్ట్రాల రేషన్ కార్డులు, రెండు ఓటర్ కార్డులు ఉన్నాయి. ఇద్దరు ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుంటారు. కొఠియా వివాదాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని 2006లో సుప్రీంకోర్టు సూచించింది. అయితే కొఠియాపై ఆధిపత్యానికి ఒడిశా ప్రయత్నిస్తోంది. తమదే కొఠియా అంటూ 2018 నుంచి దూకుడు పెంచింది. కోట్లాది రూపాయలతో ఆ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. ప్రభుత్వ కార్యాల యాలు, భవనాలు, పోలీస్ స్టేషన్లు, స్కూళ్లను ఏర్పాటు చేసింది. కొఠియా గ్రూప్‌కు చెందిన ప్రతి గ్రామంలో ఒడిశా నిర్మాణాలున్నాయి. ప్రతి గ్రామానికి తారు, సిమెంట్ రోడ్లు వేశారు. గత ఐదేళ్లలో వైసీపీ సర్కారు మాత్రం ఆ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. కీలకమైన కొఠియాలో ఎటువంటి ప్రభుత్వ భవనం లేదు. గతంలో కొఠియాలో ఉన్న ఏపీ పోలీస్‌స్టేషన్ వివిధ కారణాలతో ఎత్తి వేశారు. మరోవైపు ఏపీ ఉద్యోగులు కొఠియా వెళ్తే.. ఒడిశా అధికారులు అడ్డుకోవడం పరిపాటిగా మారింది. దీంతో కొన్నిసార్లు ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 2021లో అప్పటి ఏపీ, ఒడిశా సీఎంలు జగన్, నవీన్ పట్నాయక్‌లు చర్చలు జరిపినా.. కొఠియా వివాదం మాత్రం పరిష్కారం కాలేదు. సీఎస్ స్థాయిలో కమిటీని సైతం ఏర్పాటు చేసినా.. ఒడిశా దూకుడు తగ్గించలేదు. కొఠియా గ్రూప్ గ్రామాలపై ఒడిశా ప్రజాప్రతినిధులు పలుమార్లు వివాదస్పద వ్యాఖ్యలు చేశారు.



అపార ఖనిజ సంపద..

ఏవోబీలో ఉన్న కొఠియా గ్రూప్ గ్రామాలుగా ఎగువ కొఠియా, దిగువ కొఠియా, ఎగువ గంజాయిభద్ర, దిగువ గంజాయిభద్ర, కురిడిభద్ర, ఎగువశెంబి, దిగువశెంబి, ధూళిభద్ర, సోలిపిగుడ తదితర 21 గ్రామాలున్నాయి. తూర్పు కనుమల్లో అపార ఖనిజ సంపదతో ఉన్న ఈ గ్రామాలపై ఇరు రాష్ట్రాలు తమవంటే, తమవని వాదులాడుతున్నాయి. ఈ గ్రామాల పరిధిలో ఉన్న కొండల్లో ఖనిజ నిక్షేపాలపై ఆధిపత్యానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు హక్కు కోసం పట్టుబడుతున్నాయి. కాగా ప్రస్తుతం రాజకీయ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో కొఠియా సమస్యకు చెక్ పడనుందని ఇరు రాష్ట్రాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా..



ఇది సీతంపేట మండలం రామానగరంగూడలో పరిస్థితి. విద్యుత్ సర్వీస్ వైర్లకు ఎందుకిలా వాటర్ బాటిల్ వేలాడదీశారనుకుంటున్నారా? గట్టిగా గాలులు వీస్తే.. విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా ఉండాలనే.. గిరిజనులు ప్రాణాలకు తెగించి ఈ విధంగా చేయాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ఆ వైర్లకు రాళ్లు, మరికొన్నిచోట్ల వాటర్ బాటిళ్లు వేలాడదీస్తున్నారు. వాస్తవంగా ఈ గిరిశిఖర గ్రామంలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. వారి ఇళ్లకు విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన సర్వీస్ వైర్లు కలవకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ వారు పట్టించుకోకపోవడంతో ప్రమాదమని తెలిసినా.. గిరిజనులే ఇలా చేయాల్సి వస్తోంది. అసలు మారుమూల ప్రాంతాల్లో సక్రమంగా సర్వీస్ వైర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఈదురుగాలులు సంభవించేటప్పుడు తరచూ అవి తెగిపోతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో గిరిజనులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

\- సీతంపేట

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

- గతంలో పంచాయతీకి ఆదాయం.. రైతు పొలాలకు ఎరువు
- నాలుగేళ్లుగా వినియోగంలో లేని వైనం



పురిటిపెంటలో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

గజపతినగరం: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చెత్తను సేకరించి వాటి ద్వారా ఎరువులను తయారు చేసి రైతులకు విక్రయించి వాటి ద్వారా వచ్చే ఆదాయం పంచాయతీలకు ఉపయోగపడేలా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే అధికారులకు శిక్షణ ఇచ్చి వర్మీకంపోస్టు ఎరువులను తయారు చేశారు. కేంద్రాల ద్వారా రైతులకు కిలో రూ.10 చొప్పున రైతులకు విక్రయించేవారు. దీంతో రైతులు పంటపొలాలకు ఎరువుగా తీసుకువెళ్లేవారు. దీంతో పంచాయతీలకు రాబడి వచ్చేది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని విస్మరించింది. ఉన్న రంగులను తొలగించి వాటిని నిరుపయోగంగా వదిలివేశారు. నాలుగేళ్లగా చెత్త సంపద కేంద్రాలు పడకేసాయి. చెత్తను తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేసిన అధికారులు సేకరించిన చెత్తను కేంద్రాలకు కాకుండా గ్రామాల బయట ఉన్న చెరువులు, వాగుల వద్ద వదిలివేస్తున్నారు. దీంతో గ్రామాల చివర చెత్త పేరుకుపోతుంది. అలాగే చెత్త సేకరించేందుకు ప్రతి ఇంటికీ చెత్తబుట్టల పంపిణీ నిలిచిపోయింది. ఇంటి ముందు చెత్త తీయకుండానే చెత్త పన్ను వేస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 30 పంచాయతీల్లో 26 పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయి. నిరుపయోగంగా ఉన్న కేంద్రాలు రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిపోవడంతో తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్త సంపద కేంద్రాలు నడిపించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటాం. కొన్ని గ్రామాల్లో చెత్త సేకరిస్తున్నాం. గ్రామ కార్యదర్శులు పర్యవేక్షణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటారు.

\- జనార్దనరావు, ఈవోపీఆర్డీ, గజపతినగరం

ప్రమాదమని తెలిసీ..

- రైల్వే గేటు కింద నుంచి వాహనాలతో రాకపోకలు
- అధికారులు హెచ్చరిస్తున్నా పట్టించుకోని వైనం



రైల్వే గేటు కింద నుంచి వెళ్తున్న ద్విచక్ర వాహన చోదకులు

గజపతినగరం: ప్రమాదమని తెలిసీకూడా వాహనదారులు జాగ్రత్తలు తీసుకోక పోవడం శోచనీయం. స్థానిక మెంటాడ రైల్వే గేటు వద్ద రైలు వచ్చిన సమయంలో గేటు పడినప్పటికీ పలువురు వాహనదారులు గేటు కింద నుంచి రాక పోకలు సాగిస్తున్నారు. అనుకోకుండా రైలు వచ్చే సమయానికి గేటు మధ్య ఉండిపోతే పెను ప్రమాదానికి గురయినట్లే. వాహనదారులకు రైల్వే అధికారులు హెచ్చరికలు జారీ చేసినా పట్టించుకోక పోవడం శోచనీయం. గతంలో పలు ప్రమాదాలు సంభవించినా వాహనదారులు లెక్క చేయక పోవడం గమనార్హం.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- టీడీపీ నాయకులు లెంక అప్పలనాయుడు, హైమావతి



మాట్లాడుతున్న అప్పలనాయుడు, హైమావతి

నెల్లిమర్ల: నెల్లిమర్లలో అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలపై అధికారులు కొరడా ఝులిపించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, 6వ వార్డు కౌన్సిలర్ లెంక హైమావతి డిమాండ్ చేశారు. నెల్లిమర్లలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. నెల్లిమర్లలో ఎక్కడపడితే అక్కడే అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. అనుమతులే లేకుండా నిర్మాణాలు జరుగుతుంటే నగర పంచాయతీ అధికారులు ఏం చేస్తున్నారని వారు ప్రశ్నించారు. తక్షణమే నగర పంచాయతీ కమిషనర్‌తో పాటు ప్రణాళిక విభాగం అధికారులు స్పందించాలని వారు కోరారు. అనుమతులు లేని భవన నిర్మాణాలను వెంటనే నిలిపివేయించాలని వారు డిమాండ్ చేశారు. నగర పంచాయతీకి పన్నుల ఆదాయం పెంచాలని కోరారు. అలాగే పలు ప్రాంతాల్లో ఉన్న తాగు నీటి సమస్యను, వీధి లైట్ల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

నవధాన్యాల కిట్లు తయారీపై అవగాహన



నవధాన్యాల కిట్లు తయారీపై అవగాహన కల్పిస్తున్న డీపీఎం ఆనందరావు

గంట్యాడ: మండలంలోని కొండతామరాపల్లి రైతు భరోసా కేంద్రంలో శనివారం నవధాన్యాల కిట్ల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం ఆనందరావు పాల్గొని మాట్లాడారు. వరి పంట వేసే ముందు ఎకరానికి 10 కేజీల చొప్పున నవ ధాన్యాలు వేయడం వల్ల భూసారం పెరుగుతుందని ఆయన తెలిపారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, తీగజాతి, పచ్చిరొట్ట విత్తనాలు కలిపి వేయడం వల్ల రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంటీ ఈశ్వరమ్మ, ఎల్‌టీలు గాయత్రి, సీతారత్నం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాములుంటాయ్.. జాగ్రత్త సుమీ..!

- వర్షాకాలంలో విష సర్పాల సంచారం
- పొలాల్లో రైతన్నలు అప్రమత్తంగా ఉండాలి



పొలం పనుల్లో నిమగ్నమైన రైతు

(గరుగుబిల్లి)

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వానా కాలం ప్రారంభంలో విష సర్పాల బెడద ఎక్కువగా ఉంటుంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు గతంలో పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం రైతులు ఎక్కువగా పొలాల్లో గడుపుతారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఈనెల నుంచి సెప్టెంబరు వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. గతేడాది పార్వతీపురం మన్యం జిల్లాలో 12 మంది రైతులు పాము కాటుతో ప్రాణాలు కోల్పోగా, 15 మంది ఆసుపత్రులకు వెళ్లి కోలుకున్నారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

పొలాల గట్ల మీద వెళ్లేటప్పుడు కర్ర చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రి పూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లినప్పుడు టార్చిలైట్ తీసుకు వెళ్లాలి. ధాన్యపు గాదెలు, గడ్డి వాములు ఉండే చోట ఎలుకలు తిరుగు తాయి. తడిగా ఉంటే కప్పలు చేరుతాయి. వాటిని తినడానికి పాములు చేరుతాయి. అలాగే తేళ్లు వంటి ప్రమాదకర ప్రాణులు తిరుగాడే ఆస్కారం ఉంది. ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉండాలి. ఎక్కువగా పాములు పొదల్లోనే ఉంటాయి. గోడల పక్కన చేరుతాయి. చీకట్లో బయటకు వెళితే తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.

అన్ని పాములు ప్రమాదకరం కాదు..

పాముల్లో చాలా వాటికి విషం ఉండదు. కట్ల పాములే ప్రమాదకరమైన సర్ప జాతులు. వాటితోనే ఎక్కువ ప్రమాదం ఉంటుంది. సాధారణంగా 50 శాతం పాము కాట్లు విషం ప్రమాదం లేని మాములు గాయాలే. సాధారణ చికిత్స తీసుకుంటే నయమవుతాయి. పాముల కన్నా చాలా మంది షాక్‌తోనే ప్రాణం మీదకు తెచ్చుకుంటారు. ఇంట్లో వారు ధైర్యం చెప్పడానికి బదులు ఏడిస్తే భయాందోళనకు గురై పరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది.

పాము కాటు లక్షణాలు..

- పాము కాటుకు గురైన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఆందోళన చెందితే గుండె పోటుకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ప్రథమ చికిత్సలో భాగంగా పాము కాటు వేసిన చోట కట్టు వేయాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి.
- పాము కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండకాలు బిగుసుకున్నట్లు, గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు.
- కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.

ఇలా చేయకూడదు..

పాము కాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింతగా కోస్తే రక్తంతో పాటు విషం వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటు పెడతారు. అలా చేయవద్దు. ఒక్కోసారి పాము కాటు కన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారవచ్చు.

అందుబాటులో వ్యాక్సిన్..

పాము కాటు బారిన పడిన వ్యక్తికి పీహెచ్‌సీలో చికిత్స అందుబాటులో ఉంది. వారికి కావాల్సిన యాంటీ స్నేక్ వీనం ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. పాము కాటుకు గురైన వ్యక్తి ఆందోళన, భయం చెందకుండా నిర్భయంగా ఉండాలి. కరిచిన వెంటనే ముందుగా గాయంపై భాగాన్ని వస్త్రంతో గట్టిగా లాగి కట్టి ఉంచాలి. వెంటనే దగ్గరలోని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకోవాలి. గాయాన్ని బట్టి రెండుసార్లు స్నేక్ వీనం డోస్ తీసుకుంటే ఎటువంటి ప్రమాదం ఉండదు. ముఖ్యంగా భయపడకుండా ఉండాలి.

\-కె.విజయ పార్వతి, డీఎంఅండ్‌హెచ్‌వో

పాములు - విష ప్రభావం..

- **కట్ల పాము:** ఇది కాటేసిన క్షణాల్లోనే విషయం రక్త కణాల్లో కలుస్తుంది. వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలి.
- **నాగు పాము:** ఇది కాటేసిన 15 నిమిషాల్లో శరీరంలోకి విషం ఎక్కుతుంది.
- **రక్త పింజర:** ఇది కాటేసిన రెండు గంటల తరువాత విషం శరీరంలోకి ఎక్కుతుంది.
- **జెర్రి పోతు, నీరు కట్ట:** ఇవి కాటేసినా విషం ఉండదు. అయితే ఇవి కాటు వేసినా ఆసుపత్రిలో చికిత్స అవసరం.

పీహెచ్‌సీల్లో ఇంజక్షన్లు..

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో పాము కాటుకు యాంటీ స్నేక్ వీనమ్ మందు అందుబాటులో ఉంది. పాముల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పాము కరిచిన వెంటనే ఏదైనా వాహనంలో ఆరోగ్య కేంద్రానికి చేర్చాలి. నడిపించకూడదు.

\-డాక్టర్ కేకే సాగర్‌వర్మ, గరుగబిల్లి పీహెచ్‌సీ

రామోజీరావుకు నివాళి

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు శనివారం మృతి చెందడంతో జిల్లా అంతటా సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మీడియా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాధాకరం..

పాలకొండ: అక్షర యోధుడు రామోజీరావు తుదిశ్వాస విడవడం బాధాకరమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని చెప్పారు. అక్షరానికి సామాజిక బాధ్యత ఉందని రామోజీరావు నిరూపించారన్నారు. ఆయన కుటుంబానికి జనసేన తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు చెప్పారు.

రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా..

సాలూరు రూరల్: ఈనాడు-ఈటీవీ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతికి సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె శనివారం మాట్లాడుతూ రాజకీయంగా ఎన్నో ఒత్తిళ్లు వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రయోజనాలే ధ్యేయంగా ఆయన ముందుకు సాగారన్నారు. టీడీపీ నేతలు చిట్టి, యుగంధర్, కృష్ణ, కనక తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి



సాలూరు రూరల్: రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సంధ్యారాణి

కేవలం జర్నలిజం, సినీ రంగాలతో పాటు రెండు రాష్ట్రాల తెలుగు ప్రజలకు ఎంతో లోటని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రామోజీరావు మృతి తనకు ఎంతో బాధ కలిగించిందన్నారు. తన సంస్థలో పనిచేసిన వారికి రిటైర్‌మెంట్ అనంతరం కూడా ఆయా కుటుంబాల జీవనోపాధికి ప్రత్యేక చర్యలు తీసుకున్న ఘనత రామోజీరావుకే దక్కుతుందన్నారు.

సంతాపం తెలిపిన ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ఈనాడు వ్యవస్థాకుడు రామోజీరావు మృతికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సంతాపం ప్రకటించారు. ఆయన మృతి మీడియా రంగానికి, ఇరు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్నారు.



పాలకొండ: నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు



గరుగుబిల్లి: నాగూరులో..



కురుపాంలో..



బలిజిపేటలో..



సీతానగరంలో..

క్లుప్తంగా..

దోమల నివారణకు చర్యలు

కురుపాం రూరల్: రాబోయే వర్షాకాలంలో దోమలు విజృంభించి ప్రజలు మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యగా దోమల మందును పిచికారీ చేసే కార్యక్రమం శనివారం ప్రారంభం అయ్యింది. మొండెంఖల్ పీహెచ్‌సీ పరిధిలోని దూళికుప్ప, కోనగూడ, ఉరిడి గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేశారు. జిల్లా మలేరియా అధికారి టి.జగన్మోహనరావు ఆదేశాల మేరకు కార్యక్రమం చురుగ్గా నిర్వహిస్తున్నట్టు వైద్య సిబ్బంది జె.తిరుపతిరావు, సత్యరాజ్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చర్యలు

గరుగుబిల్లి: గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోను శంకరరావు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయిలో చైతన్యపర్చనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవానికి షర్మిలరెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన

గరుగుబిల్లి: ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధి గాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి, కోదండరామ స్వామి ఆలయాల్లో శనివారం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు వెంకటరమణ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా అభివృద్ధి కమిటీ ప్రతినిధి డాక్టర్ డి.పారినాయుడు మాట్లాడుతూ ప్రధాన దేవాలయంతో పాటు ఉప దేవాలయాల నిర్మాణాల వేగవంతానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అన్నదానానికి అవసరమైన సామగ్రిని మార్కొండ సీతంనాయుడు, ఎం.ప్రవీణ్, గెంబలిరాజు, తోట భానుప్రసాద్ అందించారని చెప్పారు. ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది జి.శ్రీధర్‌నాయుడు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

సంధ్యారాణికి అభినందనల వెల్లువ

సాలూరు రూరల్: సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణికి శనివారం పలువురు అధికారులు, అభిమానులు అభినందించారు. సాలూరులోని తన ఇంటి వద్దకు వచ్చి ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఏపీటీఎఫ్ 257 ఉపాధ్యాయ నేతలు వెంకటేశ్వరరావు, గౌరీశంకరావు, ప్రభాకర్, తిరుపతిరావు, యూటీఎఫ్ నేతలు ఆనంద్, గణపతి, మధు, గణేష్ తదితరులు ఆమెను సత్కరించారు. వెలుగు సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

జనసేన నాయకుడు జానీకి సత్కారం

వీరఘట్టం: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జానీకి శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. బొడ్లపాడు గ్రామంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించారు. జిల్లా తూర్పుకాపు సంఘం జిల్లా యువజన కార్యదర్శి సతివాడ వెంకటరమణ, వీరఘట్టం మండలం, పట్టణ నాయకులు సరిపల్లి అచ్యుత్, కర్నేన సాయిపవన్, భార్గవ, నందివాడ పండు, ఉదయాన చరణ్, గర్బాపు నరేంద్ర, సందీప్, బొత్స కార్తీక్ పాల్గొన్నారు.



జానీని సత్కరిస్తున్న దృశ్యం

ఖాతాదారుల అభివృద్ధి యూనియన్ బ్యాంకు లక్ష్యం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఖాతాదారుల అభివృద్ధి యూనియన్ బ్యాంకు లక్ష్యమని ఆ బ్యాంకు రీజనల్ మేనేజర్ వెంకట తిలక్ అన్నారు. జిల్లా కేంద్రంలో యూనియన్ బ్యాంకు ఆధునికీకరణ అనంతరం కొత్త శాఖను ఆయన శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం బ్రాంచి శాఖ ద్వారా 235 కోట్లు బిజినెస్ జరుగుతుందన్నారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో బ్యాంకు ముందుంజలో ఉందన్నారు. ఎటువంటి గ్యారెంటీ లేకుండా ఎడ్యుకేషన్ లోన్స్ రూ.40లక్షల వరకు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ పి.రవికృష్ణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



బ్రాంచ్ ప్రారంభిస్తున్న దృశ్యం

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

- నిరసన చేపట్టిన గిరిజనులు

పాచిపెంట: మండలంలోని కుడుమూరు సర్వే నెంబరు 48లో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలంటూ శనివారం గిరిజనులు ఆ గ్రామ సమీపంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో గిరిజన రైతులు నిరసన చేశారు. గత ప్రభుత్వ హయాంలో పోరాటాలు చేసిన మేరకు సర్వే చేయించారని, అయినప్పటికీ పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే వివరాలు కూడా బయటపెట్టలేదని గిరిజన రైతులు నూకురు అప్పలస్వామి, జమ్ముల గోపాలరావు, కొర్ర కళ్యాణ్ శ్రీను తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించకపోతే న్యాయ పోరాటం చేస్తామని గిరిజనులు స్పష్టం చేశారు.



కుడుమూరు సమీపంలో నిరసన చేస్తున్న గిరిజన రైతులు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

పార్వతీపురం మన్యం జిల్లాలో శనివారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందారు. ఈమేరకు ఆయా కుటుంబాల్లో విషాధం నెలకొంది.

రైలు ఢీకొని యువకుడు..

పార్వతీపురంటౌన్: రైలు ఢీకొన్న సంఘటనలో యువకుడు శనివారం మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. పార్వతీపురంలోని బెలగాం పరిధిలోగల బూరాడ వీధికి చెందిన తెంటు భరత్(31) మండలంలోని విశ్వంబరపురంలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతున్నాడు. ఆ సమయంలో బొబ్బిలి వైపు నుంచి వస్తున్న గూడ్స్ రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెచ్‌సీ రత్నకుమార్ తెలిపారు.

బావిలో పడి ఒకరు..

మక్కువ: బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పాతకామునివలస సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మక్కువ మండలంలోని శీబిల్లిపెద్దివలస గ్రామానికి చెందిన వడ్డి నాగేశ్వరరావు (53) మద్యం తాగే అలవాటుఉంది. ఈనెల ఆరో తేదీ రాత్రి గ్రామంలో జరిగిన వివాహంలో మద్యం సేవించాడు. ఈనెల ఏడో తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. శనివారం పాతకామునివలస గ్రామసమీపంలోఉన్న బావిపైన లుంగీ, తువ్వాలు కనిపించడంతోపాటు మృతదేహం తేలుతుండడంతో కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం వడ్డి నాగేశ్వరరావుదిగా గుర్తించారు. నాగేశ్వరరావుకు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు వడ్డి చంటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు.

పది మద్యం సీసాల స్వాధీనం

శృంగవరపుకోట రూరల్ : మండలంలోని ముషిడిపల్లికి చెందిన పటాసీ సీతమ్మ అక్రమంగా ఉంచిన పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్ఈబీ ఎస్ఐ పణీంద్రబాబు శనివారం తెలిపారు. సమాచారం మేరకు దాడిచేయగా సీసాలు లభ్యమయ్యాయని చెప్పారు.

ఎనిమిది అడుగుల కొండచిలువ పట్టివేత

రేగిడి: మండలంలోని మీసాలడోలపేట గ్రామ సమీపంలో సోమన్నచెరువు గట్టుపై శనివారంసాయంత్రం ఎనిమిది అడుగుల కొండచిలువను గ్రామస్థులు గుర్తించారు. ఈ మేరకు గ్రామస్థులు పొరాంకు చెందిన స్నేక్‌క్యాచర్‌కు సమాచారం అందించడంతో ఆయన బందించారు. అనంతరం దూరంగా విడిచిపెట్టినట్లు గ్రామస్థులు తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

వంగర: మండలంలోని పలు గ్రామాల్లో రాత్రింబవళ్లు మట్టి అక్రమంగా తవ్వకాలు, రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నీలయ్యవలస, వంగర, సంగాం, సీతారాంపురం, అరసాడల్లో పదుల సంఖ్యలో నిత్యం ట్రాక్టర్లతో మట్టి తరలుతోంది. వీటిని నియంత్రించాల్సిన పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కాగా మట్టి తవ్వకాలకు ఎవరికీ అనుమతులు లేవని తహసీల్దార్ సుందరరావు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


అరసాడలో మట్టి తవ్వుతున్న దృశ్యం

జేఎస్ఎల్ మొండివైఖరి తగదు

- కార్మికులకు లేఆఫ్ ప్రకటించాలి: టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు పిల్లా అప్పలరాజు
- మంగళపాలెం గ్రామపెద్దల సంఘీభావం


కార్మికులకు సంఘీభావం తెలియజేస్తున్న మంగళపాలెం గ్రామపెద్దలు

కొత్తవలస: కర్మాగారాన్ని లాకౌట్ చేసి మూసేయడంతో కార్మికులందరికీ నష్ట పరిహారం ఇవ్వాలని కోరుతున్నామని, యాజమాన్యం మాత్రం కొంత మందికి మాత్రమే ఇస్తామని మొండివైఖరి అవలంబించడం తగదని జేఎస్ఎల్ కర్మాగారం టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు పిల్లా అప్పలరాజు ఆరోపించారు. శనివారం జిందాల్‌నగర్‌లోని జేఎస్ఎల్ కర్మాగారం ఎదుట కార్మికులు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మండలంలోని మంగళపాలెం గ్రామానికి చెందిన గ్రామపెద్దలు సంఘీభావం తెలిపారు. ఈమేరకు కార్మికులు టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు పి.రాజన్న ఆర్థికసాయంతో వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లా అప్పలరాజు మాట్లాడుతూ తాము న్యాయంకోసం చేస్తున్న పోరాటానికి ప్రతి గ్రామం నుంచి మద్దతు లభిస్తోందన్నారు. తమ న్యాయమైన కోరికపై ప్రజలు కూడా పెద్ద ఎత్తున స్పందిస్తున్నారని, ప్రతి గ్రామం నుంచి తమ శిబిరానికి వచ్చి తమ మద్దతు తెలుపుతున్నారన్నారు. మంగళపాలెం గ్రామానికి చెందిన పెద్దలు కోరిబిల్లి స్వామినాయుడు, పొలమరశెట్టి జగ్గారావు, పొలమరశెట్టి చిన్నప్ప, పొలమరిశెట్టి శాంతి స్వరూప్ వంటి పెద్దలు వచ్చి తమకు సంఘీభావం తెలియచేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికైనా జేఎస్ఎల్ యాజమాన్యం స్పందించి కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులందరి లేఆఫ్ ప్రకటించాలన్నారు. నిరసన కార్యక్రమంలో మూడు కార్మిక సంఘాలకు చెందని నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సాగునీటికి ఎదురుచూపులు

- గత ప్రభుత్వం నిర్లక్ష్యం.. రైతులకు శాపం
- ఏటా వర్షాలపైనే ఆధారం
- ఇదీ తోటపల్లి నీలయ్యవలస పిల్లకాలువ రైతుల పరిస్థితి


నీలయ్యవలస వద్ద అధ్వానంగా ఉన్న తోటపల్లి కాలువ

వంగర: మండలంలోని నీలయ్యవలస, బాగెమ్మపేట, పటువర్ధనం, దేవకివాడతో పాటు పది గ్రామాల ప్రజలకు ఏటా సాగునీటికి అగచాట్లు తప్పడం లేదు. ఇక్కడి రైతులకు సాగు నీటికోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఖరీఫ్‌లో సైతం పూర్తిస్థాయిలో పంట పండని పరిస్థితి నెలకొంది. వరుణుడు కరుణిస్తేనే పంట చేతికొస్తోంది. ఈ నేపథ్యంలో తోటపల్లి కాలువకు అనుసంధానంచేస్తూ తొమ్మిది వేల ఎకరాలకు నీరందించాలన్న లక్ష్యంతో నిర్మించిన నీలయ్యవలస పిల్ల కాలువ పనులు గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం పుణ్యమాని పూర్తికాలేదు. పలుసార్లు ఇక్కడి అన్నదాతలు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి కాలువ పనులు పూర్తిచేయాలని తీసుకువెళ్లినా చర్యలు తీసుకోలేదు. ఇంకా కిలోమీటరు మేర పనులు జరగాల్సి ఉంది.

ఇదీ పరిస్థితి..

మండలంలోని నీలయ్యవలస, బాగెమ్మపేట, పటువర్ధనం, దేవకివాడతోపాటు మరికొన్ని గ్రామాల పరిధిలో మెట్ట ప్రాంత ఆయకట్టు రైతులకు ఏటా అవస్థలు తప్ప డంలేదు. వర్షాధారంపై ఆధారపడి సాగుచేయాల్సివచ్చేది. దీంతో ఇక్కడి ఆయకట్టుకు నీరందించి తమ కష్టాలు తీర్చాలని, తోటపల్లి కాలువల ద్వారా నీరందించాలని అన్న దాతలు, రైతుల సంఘాల నాయకులు పలుసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో రెండున్నర దశాబ్దాల కిందట వంగర మండలంలో అన్నదాతలకు నీరందించాలని బలిజిపేట మండలంలోని నారానాయుడువలస వరకు వస్తున్న తోటపల్లి కాలువకు అనుసంధానం చేయడానికి 1.5 కిలోమీటర్లు మేర పిల్లకాలువ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే కాలువ నామమాత్రంగా తవ్వడంతోపాటు పనులు పూర్తిచేయలేదు. దీంతో గత రెండేళ్లుగా చుక్కనీరు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తొమ్మిది వేల ఎకరాలపై ఆధారపడి సాగుచేస్తున్న రైతులు ఏటా ఆకాశం వైపు ఎదురు చూడాల్సివస్తోంది. దీంతో కొంతమంది రైతులు ఖరీఫ్‌లో గొట్టపుబావులు నుంచి ఆయిల్ ఇంజిన్లతో నీరు తోడి పంటలను రక్షించుకుంటున్నారు. కొన్నిగ్రామాల్లో నీటిని తోడేందుకు అవకాశం లేకపోవడంతో పొట్టదశలో ఉన్న పంటను వదులుకోవాల్సివస్తోందని రైతులు వాపోతున్నారు. దీంతో నానా ఇబ్బందులు పడుతున్నామని నీలాయివలస ప్రధాన కాలువ పరిధిలో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాగా ఈ కాలువ పరిధిలో సైపన్లు మరమ్మతులు, గండ్లు పూడ్చడానికి రూ.15 లక్షలు మంజూరుకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైతే పనులు పూర్తిచేసి ఆయకట్టుకు నీరందిస్తామని సెక్షన్ జేఈ విశ్వేశ్వరరావు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలో ఇటీవల పూడికలు తీసినట్లు చెప్పారు.

తాగునీటి సరఫరాను మెరుగుపరచాలి

- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. ఈమేరకుశనివారం బొబ్బిలి పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్న భోజరాజపురం మునిసిపల్ ప్రధానవాటర్‌వర్క్సును పరిశీలించారు. మోటార్లు, బోర్లు, సంపుల పరిస్థితిని కమిషనర్ లాలం రామలక్ష్మి, డీఈఈ ఈశ్వరరావు, ఏఈలు సురేష్, రవి వివరించారు. వేగావతి నదిలో గతంలో ఏర్పాటు చేసిన ఇన్‌ఫిల్ట్రేషన్ బావి పాడైపోవడంతో, ప్రత్యామ్నాయంగా కొత్త బావిని నిర్మించేందుకు రూ. 50 లక్షలు ఖర్చవుతుందని ఆయనకు తెలిపారు. గతంలో పట్టణంలో అప్పయ్యపేట, రాజానగర్ కాలనీ, ఐటీఐ కాలనీ తదితర ప్రాంతాల్లోఏర్పాటు చేసిన పైలట్ వాటర్‌స్కీములు వృథాగా పడి ఉన్నాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. సువర్ణముఖి నది నుంచి గతంలో రూ.96 కోట్లతో టీడీపీ హయాంలో మంజూరు చేసిన ప్రత్యామ్నాయ తాగునీటి పథకం పనులు నిలిచిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బేబీనాయన పారాది ఆనకట్టను పరిశీలించారు. కార్యక్రమంలో పెంట, రంగరాయపురం, పారాది, గొర్లె సీతారాంపురం, రొంపిల్లి, అప్పలరాజుపేట , ఎస్.సీతారాంపురం గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

● **బాడంగి:** అత్యధిక మెజార్టీతో గెలిపించడంతో తన బాధ్యత మరింత పెరిగిందని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. శనివారం మండలంలో పిన్నవలసలో గ్రామానికి చెందిన కొల్లి రామినాయుడు పేదలకు దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బేబీనాయనతోపాటు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు అందజేశారు. కార్యక్రమంలో తెంటు రవిశాబు, లచ్చుపతుల సత్యం, బొంతు త్రినాథనాయుడు పాల్గొన్నారు.


మునిసిపల్ వాటర్‌వర్క్సును పరిశీలిస్తున్న బేబీనాయన

● బాడంగి మండలంలోని పిన్నవలసలో ఎమ్మెల్యే బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడులకు ఎరుకుల పాకల గ్రామపెద్దలతో కలిసి రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరు సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ పాలవలస పార్వతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

● **రామభద్రపురం:** మండలంలోని రొంపల్లి ఆనకట్టను ఎమ్మెల్యే బేబీనాయన పరిశీలించారు. కుడి, ఎడమ కాలువల ద్వారా నీరు వస్తున్నదీ లేనిదీ రైతులను అడిగి తెలుసుకున్నారు. కాగా కాగా రామభద్రపురం: బేబీనాయనను మీసేవ నిర్వాహకులు విజన్ అధ్యక్షుడు సాయి ఆధ్వర్యంలో సన్మానించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

రాజాం: మండలంలోని కంచరాంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో తరచూ విద్యుత్ సమస్య తలెత్తడంతో గ్రామస్థులు ఇటీవల ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సమస్యలపై ఆందోళన శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఇక్కడ విద్యుత్ మీటర్లు అధికంగా ఉండడంతో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ చాలకపోవడంతో సింగిల్ ఫేస్ వచ్చేదని ఏఈ తెలిపారు. కనీసం ఫ్యాన్లు కూడా తిరగని పరిస్థితి ఏర్పడేదని, ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశాల మేరకు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి నట్లు పేర్కొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేటి నుంచి తాగునీరు సరఫరా

రాజాం: మునిసిపాలిటీ పరిధిలో పలుప్రాంతాలకు ఆదివారం నుంచి తాగునీరు పూర్తిస్థాయిలో చేస్తామని ఏఈ వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడి బొబ్బిలి రోడ్డులో రక్షిత మంచినీటి పథకం ప్రధాన పైపు లైన్ పాడవడంతో మూడురోజులుగా కొన్ని ప్రాంతాలకు తాగు నీరందలేదని పేర్కొన్నారు. శనివారం పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. పాత పైపులైన్లు పాడవడం వల్ల మరమ్మతులు చేయడానికి పనిరాకపోవడంతో విశాఖపట్నం నుంచి క్రొతవి తెప్పించి ఏర్పాటు చేయడానికి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదని పేర్కొన్నారు. కొత్తపైపులకు వెల్డింగ్ పనులు చేపట్టడమే కాకుండా పూర్తిస్థాయిలో కాంక్రిట్ పనులు చేపట్టి పైపులు లీకులు పూర్తిగా నివారించినట్లు తెలిపారు. దీంతో అమ్మవారి కాలనీ, మెంతిపేట ఎస్సీ కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, కొండంపేట, మాదిగ వీధి, చాకలివీధి, బొబ్బిలి రోడ్డు, తెలగవీధి, వస్త్రపురి కాలనీ, గోపాలపురం, క్రొత్తవలస, తిమ్మయ్యపే ట, మల్లిఖార్జున కాలనీ, తిమ్మయ్యపేట తదితర ప్రాంతాలకు ఆదివారం నుంచి తాగునీరు సరపరా చేస్తామని పేర్కొన్నారు.

15న పతంజలి పురస్కార సభ

విజయనగరం దాసన్నపేట: ప్రముఖ రచయిత, పత్రికా సంపాదకులు కేఎన్‌వై పతంజలి జయంతి సందర్భంగా ఈ నెల 15న పురస్కార సభ నిర్వహిస్తున్నట్టు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తెలిపారు. శనివారం గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయం రీడింగ్ హాల్‌లో నిర్వహిస్తున్నామని, రౌతు బంగారు నాయుడుకు ఈ అవార్డుని అందిస్తున్నామని తెలిపారు. పురస్కార గ్రహీత బంగారు నాయుడు మాట్లాడుతూ పతంజలి సీరియస్ రచనలతో పాటు వర్తమాన రాజకీయాలపై కొంటె కోణంలో తన కలం ద్వారా రచనలు అందించారన్నారు. కార్యక్రమంలో వేదిక కార్యదర్శి ఎంకే బాబు, కమిటీ ప్రతినిధులు లక్ష్మణరావు, నాగేంద్రప్రసాద్, శ్రీహరిరాజు, గురజాడ ప్రసాద్ పాల్గొన్నారు.

స్మోక్ బిస్కెట్లతో ప్రాణాలకు హాని

- ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నాగుల్ మీరా

విజయనగరం రింగురోడ్డు: లిక్విడ్ నైట్రోజన్‌ని ఉపయోగించే స్మోక్ బిస్కెట్లతో నోరు, గొంతు,అన్నవాహిక, కడుపులో తీవ్రమైన గాయాలు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తి ప్రాణాపాయం పొంచిఉంటుందని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నాగుల్‌మీరా హెచ్చరించారు. శనివారం విజయనగరంలోని రింగురోడ్డు జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో ఫుడ్ కోర్టులను ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిక్విడ్ నైట్రోజన్ శరీరంలోకి వెళ్లడం వల్ల ఆక్సిజన్ అందక, మనిషి ఉక్కిరిబిక్కిరి అవుతారన్నారు. అందుకే స్మోక్‌బిస్కెట్స్ తినొద్దని సూచించారు. ఆ స్టాల్‌ని సీజ్‌చేశారు. అనంతరం బజ్జీ స్టాల్ తనిఖీ నిర్వహించి కేసు నమోదుచేశారు. ఎక్కువసార్లు మరిగించిన నూనెతోమంచూరియా, బజ్జీలను వేయించడం వల్ల క్యాన్సర్, గుండె సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. హోటళ్లు, ఫుడ్ కోర్టులలో నిబంధనలకు విరుద్ధంగా ఆహారభద్రతా ప్రమాణాలు పాటించకుండా విక్రయిస్తున్నట్టు గుర్తిస్తే 87906 03489కు ఫోన్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


ఫుడ్‌కోర్టులో తనిఖీలు చేస్తున్న సేఫ్టీ ఆఫీసర్ నాగుల్‌మీరా

ఎమ్మెల్యే లలితకుమారికి అభినందన


లలితకుమారిని అభినందిస్తున్న పశువైద్యశాఖాధికారులు

లక్కవరపుకోట: శృంగవరపుకోట నియోజకవర్గం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి అభినందనలు వెల్లువెత్తాయి. శనివారం విజయనగరం డీఎస్పీ గోవిందరావుతోపాటు పలువురు సీఐలు,ఎస్ఐలు, పశుసంవర్ధకశాఖాధికారులు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ మండల పరిషత్, రెవెన్యూ, విశాఖ డెయిరీ అధికారులు ఆమెను అభినందించారు.

● **శృంగవరపుకోట:** ఎమ్మెల్యేగా ఎన్నికైన లలితకుమారిని శృంగవరపుకోట ఆర్‌సీఎం పాఠశాల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎన్ఈపీని నిలిపివేయాలి

విజయనగరం దాసన్నపేట: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం-2020(ఎన్ఈపీ) అమలును నిలిపివేయాలని మానవ హక్కుల వేదిక, భారత నాస్తిక సమాజం జిల్లా కన్వీనర్ బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. శనివారం కోట సమీపంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యరంగాలను పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నిర్వహించాలని కోరారు. ప్రైవేటు, కార్పొరేట్ శక్తుల నుంచి రక్షించే విధంగా నూతనంగా అధికారం చేపట్టబోతున్న కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు చర్యలు తీసుకోవాలన్నారు.

నిత్యావసరాల పంపిణీ

విజయనగరం రూరల్: మారుతీ స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో 50 మంది పేదలకు బియ్యం, ఇతర నిత్యావసరాలను అందించారు. కణపాక ఆగురు వీధిలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గుత్తూరు చంద్రశేఖర్, అరసాడ అప్పలస్వామి, బుదరాయవలస వెంకటరావు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం: ఏవో


సంతగైరమ్మపేటలో నవధాన్యాల కిట్లు అందజేస్తున్న అధికారులు

శృంగవరపుకోట రూరల్: రైతులు నవధాన్యాలను సాగుచేస్తే భూములు మరింత సారవంతంగామారి దిగుబడులు పెరుగుతాయని ఏవో రవీంద్ర తెలిపారు. శనివారం మండలంలోని సంతగైరమ్మపేట ఆర్బీకేలో వీఏఏ రవి చంద్ర ఆధ్వర్యంలో రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఎంటీ కోటి, మల్లేష్ నాయుడు, చరణ పాల్గొన్నారు.

వంద టన్నుల వరి విత్తనాలు సిద్ధం

లక్కవరపుకోట: మండలంలోని రైతులకు వంద టన్నుల వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఏవో ఎం.స్వాతి తెలిపారు. 23 ఆర్బీకేలకు గాను 16 ఆర్బీకేలకు విత్తనాలు పంపించామని పేర్కొన్నారు. 1121 రకం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతుల డిమాండ్‌ను బట్టిమిగతా రకాలు తీసుకొస్తామని పేర్కొన్నారు. ముందుగా పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేస్తున్నామని, 50 శాతం రాయితీతో జీలుగ, పిల్లిపెసర, కట్టెజనుము విత్తనాలుఅందుబాటులో ఉన్నాయని తెలిపారు.

రేపు సినీ నటుడు బాలకృష్ణ జన్మదిన వేడుకలు

విజయనగరం రూరల్: సినీనటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను జిల్లా నందమూరి అభిమానసంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కాగిత శ్రీనివాస్ యాదవ్, కనకల మన్మథ ఒకప్రకటనలో తెలిపారు. ప్రేమసమాజంలో ఉదయం 10 గంటలకు కేక్ కట్ చేయడంతోపాటు వృద్ధులకుపండ్లు, దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

పొంచిఉన్న ప్రమాదం

- బొబ్బిలిలో కల్వర్టు మధ్యలో రంధ్రం

బొబ్బిలి: బొబ్బిలి పట్టణ పరిధిలోని కోరాడవీధి మసీదు జంక్షన్‌లో గల రోడ్డు కల్వర్టు వద్ద ప్రమాదం పొంచిఉంది. ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాల రాకపోకలతో కల్వర్టు మధ్యభాగంలో పెద్దరంధ్రం ఏర్పడింది. దీంతో ఈ రోడ్డులో చీకటిపడిన తర్వాత రాకపోకలు సాగించే బాటసారులు, వాహనచోదకులు భయాందోళన చెందుతు న్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తక్షణమే కల్వర్టు రం ధ్రం పూడ్చాలని ఏఎంసీ డైరెక్టరు సాదిక్ అధికారులను కోరారు.


కల్వర్టు మధ్యలో ఏర్పడిన రంధ్రం

రూపు రేఖలు మార్చి.. పొలాలుగా ఏర్పాటుచేసి

- కిల్తంపాలెం పంచాయతీలో 19 చెరువుల్లో ఆక్రమణలు
- హెచ్చరికబోర్డులు ఏర్పాటుచేసినా తొలగించిన వైనం

శృంగవరపుకోట రూరల్ : మండలంలోని కిల్తంపాలెం పంచాయతీలో 19 చెరువుల్లో గత ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. అప్పటి అధికార వైసీపీ నాయకుల అండతో గ్రామాల్లోని చోటా నాయకులు చెరువుల రూపురేఖలు మార్చేసి, వీటిని సాగు భూములుగా ఏర్పాటుచేశారని విమర్శలొస్తున్నాయి. ఇక్కడ ఆక్రమణలపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో ఈ భూముల్లో అప్పటి తహసీల్దార్ శ్రీనివాసరావు సిబ్బందితో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసినా, సదరు ఆక్రమణ దారులు వీటిని పీకిపారేసేవారు. కొన్ని రిసార్టుల పరిధిలోగల డీపట్టా భూముల్లో ఉన్న నిర్మాణాలను గుర్తించి తొమ్మిది నెలల కిందట రెవెన్యూ అధికారులు నోటీసులిచ్చారు. కాగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో ఆక్రమణలపై జోరుగా చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటారని కిల్తంపాలెం పంచాయతీ వాసులు ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ రిసార్ట్‌లో డీపట్టా భూముల్లో నిర్మాణం తొలగించకుండా గతంలో జిల్లా వైసీపీ నాయకులు కొమ్ముకాశారని, దీంతో ఈనిర్మాణం జోలికి రెవెన్యూ అధికారులు వెళ్లలేదన్న ఆరోపణలు ఉన్న విషయం విదితమే.

ఇదీ ఆక్రమణల పరిస్థితి

●కిల్తంపాలెం పంచాయతీ పరిధిలో రెండు దశాబ్దాల కాలంలో కొట్లమామిడివాని,ఎర్ర, పటుకుల, కూర్మయ్య, పట్టివాని, కర్రి బందలు, శివన్నట్యాంక్, సుంకరివాని, నంద్యాల, కొక్కరవాని, చిలకవాని, స్వామినాయుడు, రాజు, వాక వాని, నక్కవాని, పొట్టివాని, మర్రవాని,బొడ్డుచెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిలో కొన్ని చెరువుగర్భాలను చదునుచేసి వాటిని పొలాలు, తోటలుగా మార్చేశారు. ఇలా మార్పు చేసిన వాటికి జిరాయితీ రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలు వున్నాయి.

●కొంతమంది శ్మశానాలు కుడా ఆక్రమించుకున్నారు. ఈ విషయంపై పత్రికల్లో వార్తలు వచ్చిన ప్రతిసారి అధికారులు హడావుడిగా వెళ్లి చూడడం, అక్కడబోర్డులు ఏర్పాటుచేసిన రోజుల్లో వీటిని ఆక్రమణదారులు పీకేయడంపరిపాటిగా మారింది.

●అల్లూరి సీతారామరాజు జిల్లా చిలకలగెడ్డ కాలువ ద్వారా మండలంలోని ధర్మవరం వరకూ సుమారు 900 ఎకరాలకు నీరందిస్తుంది. గతంలో 50 అడుగులు ఉండే చిలకలగెడ్డ కాలువ ఆ క్రమణల పుణ్యామాని ఆరు అడుగులకు కుంచించుకుపోయింది.

●కిల్తంపాలెం పంచాయతీలోని ఓరిసార్ట్ యాజమానిఏకంగా డీపట్టా భూమిలో పెద్ద భవనం నిర్మించాడు. గత ఏడాది జూన్‌లో అప్పటి ఆర్డీవో భవానీశంకర్ దీనిని పరిశీలించి నోటీసులిచ్చి తొలగించాలని తహసీల్దార్‌కు ఆదేశించిన విషయం విదితమే. దీంతో రెవెన్యూఅధికారులు సంబంధిత యాజమానికి 6ఏ నోటీసులిచ్చామని, 15 రోజుల్లో వారి సమాధానం చూసి తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామని సెలవిచ్చారు. ఈ విషయం అంతా మరిచిపోయిన సమయంలో సర్వే ద్వారా మరోసారి వెలుగులోకి వచ్చింది.


50 అడుగుల ఉండే చిలకలగెడ్డ కాలువ ఆరు అడుగులకు కుచించుకుపోయిన దృశ్యం